# అదృష్టాన్ని చెప్పే రత్నాలు



దైవజ్ఞరత్న శ్రీ వి. ఆనంద్
హిప్నాటిస్ట్, సంఖ్యాశాస్త్ర ప్రవీణ,
వంగంటి ఆస్ట్రాలజీ అకాడమీ, 1 8 518 /6
రత్న కేఫ్ పైన, చిక్కడపల్లి, హైదరాబాద్ 20
ఫోన్: 64317

## నీలము

సంఖ్యా శాస్త్ర ప్రకారం 8,17,26 వ తేదీలలో జన్మించిన వారు ఈ రత్నము ధరించవచ్చును. సంఖ్య 8 నీలమునకు అధిపతి కావున ఈ రత్నమును ధరించవచ్చును. ఇది నీలి రంగుల్లో వుంటుంది. కాబట్టి నీలము అని పేరువచ్చింది. వీటి కాంతిని బట్టి మూడు పేర్లతో పిలుస్తుంటారు. ఇంద్ర నీలము, మహానీలము, నీలమణి అని అంటారు. ఇంద్రనీలము తల వెంట్రుక లాంటి రంగులో వుంటుంది. మహా నీలము వెదురు పువ్వు ఆకు పచ్చ రంగులో వుంటుంది. ఈ రత్నమును ధరించుటవలన దరిద్రముతో ఉన్నవారు విముక్తి పొందుతారు. నీలమణి నీలం రంగులో వుంటుంది. ఈ నీలము వేల ఖరీదులో వుంటుంది. నీలము లోపల పగిలినచో ఆ రత్నమును ధరింపరాదు నీలంలో ఆరు దోషాలు వున్నాయి అవి త్రాస, భిన్న, పాషాణ, గర్భ, మృద్గర్భ, రక్త బిందువు. నీలమును ఆవుపాలలో వుంచినచో ఆ పాలు నీలం రంగులో కనబడును. అట్టి రత్నమును జాతి రత్నము అని గమనించాలి ఇటువంటి రత్నము ధరించుట శ్రేష్టమైనది చక్కటి కాంతితో ప్రకాశించు నీలము ధరించినచో సకల సంపదలు కలుగును. నీలములో పుష్యరాగ నీలమని, కెంపు నీలమని, కాకి నీలము అని అనేక రకములున్నవి.

ఈ రత్నములు కాశ్మీరు, బర్మా, సిలోన్ దేశాలలో ఎక్కువగా లభిస్తున్నాయి. ఈ రత్నమును ధరించుట వలన తేజస్సు, శక్తి ఉత్సాహం కలుగును. కష్టముల నుండి, దరిద్రము నుండి విముక్తి పొందుతారు. జాతకంలో శని మహాదశలో ఉన్నవారు కష్టములు కలుగుచున్నచో, ఈ రత్నమును ఉంగరంలో మధ్య వేలికి ధరించినచో విముక్తి పొందుతారు. ఈ రత్నమును ధరించుట వలన దృష్టిని అభివృద్ధి చేయును, అజీర్ణమును పోగొట్టి ఆకలి కలిగించును. మనస్సును ప్రశాంతంగా వుంచును. ఏలినాటి శని వలన కష్టములు కలుగుచున్నచో ఈ రత్నమును ధరించవలెను.

# జయమ్ము నిశ్చయంబురా...

మినీ కథ

నిరుద్యోగి సుందరం తన లెక్చరర్ మిత్రుడు పాణితో కలిసి ఎలాగో కాలం గడపసాగాడు. ఇద్దరూ బాచ్‌లర్లే కాబట్టి చక్కగా కలిసి పోయారు.

ఉద్యోగం దొరికే వరకూ, ఊరికే ఉండడం ఇష్టం లేక సుందరం ఓ అమ్మాయిని ప్రేమించడం మొదలు పెట్టాడు. ఆ కాలేజీ అమ్మాయి ప్రతి రోజూ ట్యూషన్ కోసం పాణి దగ్గరకి వస్తుంది. ఆ అమ్మాయి పేరు సరోజ.

సుందరం సరోజని అలా మౌనంగా ప్రేమిస్తూ ఉంటే బాగానే ఉండేది. కానీ, ఆ అమ్మాయి తన వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని— తిండీ తిప్పలూ మానేసి గెడ్డం పెంచడం మొదలు పెట్టాడు. అతడి బాధను చూడలేని పాణి— "నేను సహాయం చేస్తాను లేరా" అంటూ— ఒకానొక దుర్ముహూర్తంలో తనకు తానే ముందు కొచ్చాడు.

మాటైతే అనేశాడు కానీ, ఏం చేయాలో పాపం పాణికి కూడా తెలీదు. బాగా ఆలోచించగా ఆలోచించగా ఎప్పుడో చదివిన వాక్యాలు అతనికి సడెన్‌గా గుర్తుకొచ్చాయి.

"ఈ కాలపు అమ్మాయిలు ఇంటి పని, వంటపని బాగా చెయ్యకలిగే అబ్బాయిల్ని ఇష్టపడతారు—" ఇవీ ఆ వాక్యాలు.

ఆ మాటలు గుర్తురాగానే పాణి ఎగిరి గంతేసి తన పథకం సుందరానికి వివరించాడు.

ఆ పథకం ప్రకారం సరోజ వచ్చే సమయానికి సుందరం ఇంట్లోని గిన్నెలన్నీ ముందేసుకుని, వీధిలోని బావి దగ్గర కూర్చున్నాడు. విమ్ము, గిమ్ము, జిమ్ము వగైరా నాలుగు రకాల క్లీనింగ్ పౌడర్లు కలిపి రెడీగా పెట్టుకున్నాడు.

సరోజ కన్పించగానే మొహం వాటలా వేసుకుని గిన్నెల్ని తోమడం మొదలు పెట్టాడు. వాటిని తళతళా మెరిసేలా తోమి, మరింత శుభ్రంగా కడిగి, ఆమె చూస్తుండగానే లోపలి గదిలోకి తీసికెళ్ళాడు. ఏం చేస్తాడు మరి. యమ జీనియస్ అయిన పాణి సలహా అది!...

గిన్నెల పని పట్టించిన తర్వాత— బావి లోంచి నీళ్ళు తోడడం, బియ్యం, కూరగాయలు తరగడం.. మొదలైన పనులన్నీ సరోజ కంటపడే లాగే చేశాడు... ప్రేమంటే మజాకానా!?

వారం రోజులు ఇలాగే గడిచాయి.

ఎనిమిదో రోజు పనిమీద వచ్చిన సరోజ నాన్నగారు అంట్లు తోముతున్న సుందరాన్ని, అతడి పనినికొంచెం సేపు కళ్ళార్పకుండా చూశారు. ఆ తర్వాత ఆయన వెళ్ళిపోయారు.

"ఇది కూడా మన మంచికే" అంటూ పాణి తెగ సంబరపడిపోయి, సుందరాన్ని కూడా అంతే సంబర పెట్టేశాడు.

తొమ్మిదో రోజు సరోజ తనతోపాటు ఎవరో ముప్పై యేళ్ల స్త్రీ మూర్తిని వెంటబెట్టుకొచ్చింది.

సుందరం హుషారుగా ఈల వేసుకుంటూ గిన్నెల్ని తీసుకుని బావి దగ్గరకు బయలు దేరాడు.

సరోజ బతిమాలుతున్నట్లుగా పాణితో ఇలా అంది— "సార్ ఈమెని మా నాన్నగారు పంపించారు. రెండేళ్ళ నుంచి మా ఇంట్లో పనిచేస్తున్నా, ఈమెకి గిన్నెలు ఎలా తోమాలో తెలీదట. మీ ఫ్రెండ్ అంట్లు బాగా తోముతారట కదా— దయచేసి ఏమీ అనుకోకుండా ఈమెకి కూడా కాస్త నేర్పించి పంపించమన్నారు..."

ఆమె మాటలు ఇంకా పూర్తి కాకముందే — బావి దగ్గర దభేల్ మన్న శబ్దం అయ్యింది. — కె.ఆదర్శ సామ్రాట్.